
ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025









# కార్పొరేట్‌కు ఆగని భూ పందేరం..!

- టాటా సోలార్, ఊర్జా వన్‌కు భూములు
- ఇప్పటికే 65 వేల ఎకరాలు కంపెనీల పరం
- తక్కువ ధరకే భూములు కొనేందుకు కంపెనీల కుట్ర

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అనంతపురం జిల్లాలో భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు ఆగడం లేదు. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 65 వేల ఎకరాలకుపైగా భూములు సోలార్ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారు. తాజాగా మరో రెండు కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. టాటా పవర్, ఉర్జా వన్ అనే కంపెనీలకు ఈనెల 14వ తేదీన అనుమతులిచ్చింది. ఈ రెండు కంపెనీలు కూడా ఉరవకొండ నియోజకవర్గం బెళుగుప్ప, వజ్రకరూరు మండలాల్లో ఏర్పాటు చేయనున్నాయి.

**బెళుగుప్పలో టాటాపవర్**

బెళుగుప్ప మండలంలోని యర్రగుడి, ఆవులెన్న, సిరిపి, దుద్దేకుంట, అంకంపల్లి, తగ్గుపర్తి గ్రామాల పరిధిలో టాటా పవర్ కంపెనీ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు 200 మెగావాట్లు, 560 ఎంపిడబ్లు డిసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఈ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇదివరకే ఈ మండలంలోని గంగవరం ప్రాంతంలో 400 మెగావాట్లకు అనుమతులిచ్చింది. ఇప్పటికే ఆ సంస్థ భూసేకరణను ప్రారంభించింది. ప్రభుత్వం ఉత్తర్వుల్లో లీజు పద్ధతిలో సేకరించుకోవాలని పేర్కొంది. లీజు ఎకరానికి ఏడాదికి రూ.31 వేలు అని చెబుతున్నప్పటికీ బెళుగుప్ప మండలంలో ఆ సంస్థ కారుచౌకగానే భూములను నేరుగా కొనుగోలు చేపట్టింది. ఎకరం రూ.4.50 లక్షల చొప్పున భూసేకరణ చేస్తుండటం గమనార్హం. నల్లరేగడి నేలలుండే ఈ మండలంలో మంచి పంటలు పండుతాయి. ఇక్కడ కూడా కార్పొరేట్ కంపెనీలు పాగా వేస్తున్నాయి. వేలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయ్యాయి.

**వజ్రకరూరులో ఉర్జావన్**

వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల, గుళ్ళపాలెం, కమలపాడు గ్రామాల పరిధిలో ఉర్జావన్ అనే సంస్థ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో దీని ఏర్పాటుకు అనుమతులిచ్చింది. ఇక్కడ కూడా అదే పరిస్థితులే కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం లీజు పద్ధతి అని అనుమతులిచ్చినప్పటికీ నేరుగానే సంస్థ భూములు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇది వరకే 250 మెగావాట్ల అనుమతులున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం భూములిచ్చేందుకు అనుమతులిస్తోంది. దీంతో రైతులు భూములు వదులుకుని శాశ్వత వలసలు వెళ్లే పరిస్థితులు నెలకొనే అవకాశముందని పలువురు రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూములు ఇస్తున్న రైతులకు సరైన పరిహారం కూడా అందటం లేదని చెబుతున్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని పూర్తిగా పక్కనబెట్టి రైతులకు సరైన పరిహారం ఇవ్వకుండానే భూములు తీసుకుంటున్నట్టు విమర్శలున్నాయి.

# మాటల్లోనే జీఎస్టీ తగ్గింపు..!

జీఎస్టీ తగ్గింపుతో మీ జీవితాలనే మార్చేశామంటూ ప్రధాని నరేంద్ర మోడీ మొదలు రాష్ట్రంలోని కూటమి నేతలందరూ ప్రతి రోజు ఊదరగొడతున్నారు. అయితే ఇదంతా ప్రచార ఆర్భాటమే అనేలా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఉంది. చాలా రకాల మందులు, నిత్యావసరాలకు తగ్గిన జీఎస్టీ అమలు కావడం లేదు. పాత ఎంఆర్పీ ప్రకారమే వీటిని వ్యాపారులు విక్రయిస్తున్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అంటూ అధికార యంత్రాంగం చేస్తున్న హడావుడి ప్రచారానికే పరిమితమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచార ఆర్భాటానికి ఇచ్చిన ప్రాధాన్యత కొత్త జీఎస్టీ ఫలాలను ప్రజలకు అందించే దిశగా చర్యలు తీసుకోలేకపోవడం గమనార్హం.




- పాత ఎమ్మార్పీకే విక్రయాలు
- ఔషధాల ధరల్లో ఒక్క రూపాయి తగ్గని వైనం
- నిత్యావసరాల పరిస్థితి అంతే
- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ప్రచారానికే పరిమితం
- చోద్యం చూస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ




**ప్రజాశక్తి-పెనుకొండ**

పలు ఔషద మందులపై 12, 18, 6.25, 11.02, 5 శాతం జీఎస్టీ ఉండేది. వీటిన్నంటిపై ఆయా మందులను బట్టి 4 నుంచి 12 శాతం వరకు జీఎస్టీని కేంద్రం తగ్గించింది. కొన్ని రకాల మందులపై జీఎస్టీ పూర్తిగా రద్దయ్యింది. అయితే రద్దైన జీఎస్టీ అమలు చేయకుండా పాత ధరకే మందులను వ్యాపారులు విక్రయిస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో ఔషధాలధరలు తగ్గుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలుతోంది. కొన్ని కార్పోరేట్ మెడికల్ షాపులు తమ ధర ఇంతే అన్నట్టు విక్రయాలు చేస్తున్నారు. అధికారులు జీఎస్టీ తగ్గిందని షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకుంటున్నారు. ధరల తగ్గింపునకు తీసుకుంటున్న చర్యలు మాత్రం కనిపించ లేదు. జీఎస్టీ తగ్గకముందు కొన్నవి ఉండటంతోనే దుకాణదారులు హోల్‌సేల్, రిటైల్ మందుల షాపుల వారు జీఎస్టీ మినహాయింపు ఇవ్వకుండా పాత ధరలతోనే ఇప్పటికీ విక్రయాలు చేస్తున్నారు. జీఎస్టీ ధర తగ్గింది కదా అని ఎవరైనా కొనుగోలుదారులు అడిగితే తమదగ్గరున్న నిల్వలు తక్కువ ధరకు అమ్మితే తాము నష్టపోతామని వాటిని పాత ధరకే అమ్ముతామంటూ వ్యాపారులు చెబుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం కొత్త జీఎస్టీని అమలు చేయాల్సిందేనంటూ ప్రకటనలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం ఆపరిస్థితి కన్పించడం లేదు. జీఎస్టీ తగ్గింపు ప్రచారం ఓ పండుగలా ప్రభుత్వం నిర్వహిస్తున్నా వాటి ఫలాలు ఇంకా వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. ఒక్కొక్క కుటుంబానికి అంత.. ఇంత.. ఆదా అయిందని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచారం చేస్తున్నారే తప్పా ఆచరణలో ఆ మిగులు ఇంకా ప్రజల దరి చేరలేదు.

**జీఎస్టీ తగ్గినా.. దిగిరాని ధరలు..**

జీఎస్టీ తగ్గించాం.. ధరలుతగ్గాయి కదా అని నిత్యావసరాల కొనుగోలుకు మార్కెట్ వెళ్తే అక్కడ కూడా ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. అన్ని షాపుల్లోనూ కంపెనీ వస్తువులను పాత ధరలకే విక్రయాలు చేస్తున్నారు. తాము కొనుగోలు చేసిన ధరలకే స్టాకు అయిపోయేంత వరకు పాత ధరకే విక్రయాలు సాగిస్తామని దుకాణదారులు చెబుతున్నారు. టూత్‌ఫేస్ట్ మొదలు గృహోపకరణ వస్తువులన్నీ ఇప్పటికీ పాత ధరలతోనే మార్కెట్లో విక్రయాలు జరుగుతున్నాయి. నూతన టారిఫ్ ప్రకారం 12 శాతం జీఎస్టీ ఉన్న వస్తువులు 5 శాతంలోకి వెళ్లాయి. ఈ సెక్టార్లో వ్యత్యాసం 7 శాతంగా ఉంది. దీన్ని బట్టి రూ.1000 వస్తువు కొనుగోలు చేస్తే రూ.70 తగ్గాలి. వాస్తవానికి ప్రస్తుత మార్కెట్‌లో ఇది ఎక్కడా అమలుకాలేదు. సామాన్యులు ఉపయోగించే బియ్యం, గ్యాస్, పప్పు, నూనెల ధరలు అలాగే ఉన్నాయి. కొన్ని ధరలు గతం కంటే పెరగడం విస్మయాన్ని కలిగించే అంశం.

**ప్రచారానికే పరిమితం**

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందంటూ బస్టాండ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, కార్యాలయాలతో పాటు అన్ని చోట్ల అధికారులు పెద్ద ఎత్తున ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 25 నుంచి జీఎస్టీ ఉత్సవాల పేరుతో పెద్ద ఎత్తున కార్యక్రమాలనూ చేస్తున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటున్నారు. ధరలు తగ్గించకుండా ఈ ఉత్సవాలు ఏమిటంటూ ప్రజలు నిట్టూర్పు విదిలిస్తున్నారు. పాత ధరలకే అన్ని నిత్యావసర వస్తువుల విక్రయాలు జరుగుతున్నా అధికారులు ఏమి చేస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పెనుకొండ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమం ప్రచారం చేస్తున్న అధికారులు ప్రజా ప్రతినిధులు(ఫైల్ ఫోటో)

**తగ్గిన జీఎస్టీ అమలు చేయాలి**

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో తగ్గిన ధరలు అమలు కావడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ప్రచార ఆర్భాటమే తప్పా ధరల తగ్గింపు కనబడడం లేదు. ప్రచారం మాని తగ్గిన జీఎస్టీని తక్షణమే అమలు చేయాలి.

**బాబా వలి, సిపిఎం నాయకులు.**

## నేడు మడకశిరకు రైల్వే మంత్రి

**ప్రజాశక్తి-మడకశిర టౌన్**

కేంద్ర రైల్వే, జలవనరుల శాఖ మంత్రి సోమన్న శుక్రవారం మడకశిరలో పర్యటించనున్నారు. ఆయన రాయదుర్గం–తుమకూరు రైల్వే పనుల పురోగతిని నేరుగా పరిశీలించేందుకు పావగడ, మడకశిరలో పర్యటి స్తారు. ఉదయం మడకశిర మీదుగా పావగడకు వెళ్లే సందర్భంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నివాసానికి వస్తారు. ఆ తర్వాత పావగడలో పనుల పురోగతిని పరిశీలించి మధ్యాహ్నం 1 గంటకు మడకశిర పట్టణ సమీపంలో జరుగుతున్న రైల్వే పనులను పరిశీలిస్తారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి బెంగళూరుకు తిరుగు ప్రయాణం అవుతారు.



జిఎస్‌టిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

## జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన

**ప్రజాశక్తి-రొద్దం**

జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని టిడిపి నాయకులు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ నరహరి మాట్లాడుతూ మంత్రి సవిత ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి గ్రామంలో 'సూపర్ జిఎస్‌టి'పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్నపయ్య, చంద్రమౌళి, వీరాంజనేయులు, రామచంద్ర, అశ్వర్థ నారాయణ, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్ధన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా చెట్టు ఊరంతా నందనవనం : ఛైర్మన్

**ప్రజాశక్తి-మడకశిర టౌన్**

మడకశిర పట్టణంలో పచ్చదనం పెంపొందించి నందనవనంగా తీర్చిదిద్దుతామని నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహరాజు, కమిషనర్ పగడాల జగన్నాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బిసి హాస్టల్ రోడ్డులో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఛైర్మన్ నరసింహరాజు, కమిషనర్ పగడాల జగన్నాథ్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికీ మొక్కలు సరఫరా చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా నగర పంచాయతీ తీసుకుంటుందని తెలిపారు. అటవీ శాఖ అధికారులను సంప్రదించి మొక్కలకు ట్రీ గార్డ్స్ సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిఓ నాగేశ్వరి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.మేరీ సీయోన్ కుమారి, శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.




మడకశిరలో రోడ్డు పక్కన మొక్క నాటుతున్న ఛైర్మన్, కమిషనర్, నాయకులు

## 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యలు పట్టవా : సిఐటియు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్**

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని అనంతపురం జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రశ్నించారు. కార్మికుల సమస్యలపై గురువారం స్థానిక సంప్‌హౌస్ వద్ద సమావేశం నిర్వహించారు. నాగేంద్ర మాట్లాడుతూ వేతనాల్లో కోత విధిస్తామని, ఉద్యోగాలు తొల గిస్తామని కార్మికులపై కాంట్రాక్టర్ల బెదిరింపులు మానుకోవాలన్నారు. ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి పని చేస్తున్న కార్మికులు చాలీచాలని వేతనంతో రాత్రింబవళ్లు పనిచేస్తున్నారన్నారు. కార్మికులు ఇది వరకూ ఈపిఎఫ్, ఈఎస్‌ఐలతో కలిపి రూ. 18,200 వేతనం పొందేవారని, కూటమి ప్రభుత్వంలో కొత్త కాంట్రాక్టర్లు రావడంతో వేతనం రూ. 11,200 చెల్లిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఈ వేతనంతో పని చేయకపోతే ఉద్యోగం వదిలి వెళ్లిపోవాలని చెప్పడం బాధాకరమన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు ఏజెన్సీలు తీసుకుని కార్మికుల పొట్టగొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ తాగునీటి పథకాలను పటిష్టం చేస్తామని చెబుతూనే కార్మికులను తొలగించే ప్రక్రియకు పూనుకోవడం సరైంది కాదన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ కార్యాలయ సిబ్బంది సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాగునీటి పథకం యూని యన్ నాయకులు వన్నూరుస్వామి, నరేష్, ఓబుళపతి, తిప్పేస్వామి, గంగాధర్, శెట్టూరు నరేష్, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

## ఆహారం వృథా చేయొద్దు

**ప్రజాశక్తి-పెనుకొండ**

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.జయప్ప మాట్లాడుతూ నేటికీ ప్రపంచ వ్యాప్తంగా ఏటా 150 కోట్ల టన్నుల ఆహారం వృథా అవుతోందని, 68 కోట్ల మంది ప్రజలు ఆకలితో అలమటించడం విచారకరమన్నారు. ప్రతి విద్యార్థి, పౌరుడు ఆహార వృథాను అరికట్టి ఆకలి కేకలను ఆపాలని సూచించారు. జంతు శాస్త్రం విభాగాధిపతి హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాల న్నారు. యువత కూడా ఆరోగ్యకరమైన పంటలు పండించడం వైపు మారాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యుఎసి కోఆర్డినేటర్ యశోదరాణి, ఎన్ఎస్ఎస్ అధికారి హరిప్రసాద్, ప్రతాప్, తెలుగు అధ్యాపకులు రామన్న, నింగప్ప, నాగేష్‌గౌడ్, మమత, లలిత, చంద్రమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

**పెనుకొండ టౌన్ :** పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పెనుకొండ ఎంఇఓ రాఘవయ్య, రిటైర్డ్ టీచర్ భాస్కర్ హాజరయ్యారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు క్రమశిక్షణతో పాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం అన్నారు. రాఘవయ్య, భాస్కర్ విద్యార్థులకు ఆహార పద్ధతులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఏవో స్వామి కేశవయ్య, బాటనీ డిపార్ట్మెంట్ అధ్యాపకులు అనిల్‌కుమార్, సాయిలత, శ్రావణి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జయప్ప



వాల్మీకి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఆ సామాజిక వర్గం ప్రజలు

## ఘనంగా వాల్మీకి జయంతి

**ప్రజాశక్తి-రొద్దం**

మండలంలోని బూచర్ల గ్రామంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు జ్యోతులు ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచి సోమిరెడ్డి, పాత్రికేయులు నాగరాజు, సింగిల్‌విండో డైరెక్టర్ నారాయణస్వామి, డీలర్ చంద్రమౌళి, నీటి సంఘం అధ్యక్షులు శంకర్, ఎస్ఎంసి ఛైర్మన్ కదిరన్న, నారాయణ, అశ్వత్తప్ప, సుబ్బరాయప్ప, దాసప్ప, గోపాల్, ముత్యాలు, హనుమయ్య, సుబ్బయ్య, ఈరప్ప, నారాయణప్ప, సిద్ధప్ప, అంజి, వెంకటరమణప్ప, రంగప్ప, ముత్యాలప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' జాబ్‌కార్డుకు ఈకెవైసి తప్పనిసరి

**ప్రజాశక్తి-రొద్దం**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులకు వెళ్లాలంటే జాబ్‌కార్డు తప్పనిసరి. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు మండలంలోని ప్రతి గ్రామంలో కలియ తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ చేస్తున్నారు. ఇందులో భాగంగా రొద్దం ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు గురువారం చిన్న కోడిపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ నిర్వహించారు.



జాబ్‌కార్డు కలిగిన ఉపాధి హామీ కూలీలకు ఈకెవైసి చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు



విద్యార్థినులకు స్కూల్ డైరీలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

## విద్యార్థినులకు స్కూల్ డైరీలు పంపిణీ


**ప్రజాశక్తి-గోరంట్ల**

పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్‌లో గురువారం టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ డైరీలు పంపిణీ చేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు, నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నారన్నారు. ఎస్ఆర్ఆర్ ఛారిట బుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, మంత్రి సవిత ఆదేశాల మేరకు విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హస్తకళల రాష్ట్ర డైరెక్టర్ సోమశేఖర్, నాయకులు నిమ్మల శ్రీధర్, నరేష్, అజ్మతుల్లా, లక్ష్మీనారాయణ, సంతోష్, మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-పెనుకొండ టౌన్**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చెకుముకి సైన్స్ సంబరాలు–2025' పోస్టర్‌ను గురువారం పట్టణంలో డివైఈవో జోహాన్ రెడ్డప్ప, ఎంఇఒ రాఘవయ్య, జెవివి మండల అధ్యక్షులు ఎంకె.నబి విడుదల చేశారు. డివైఈవో మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పరీక్షలు రాయాలన్నారు. ఈ పరీక్షలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి పెంచడానికి తోడ్పడేలా ఉంటాయన్నారు. అక్టోబర్ 18వ తేదీ పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పరీక్షలు జరుగుతాయని, అన్ని స్కూల్స్ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.



చెకుముకి సంబరాల పోస్టర్ విడుదల చేస్తున్న డివైఈవో

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**ప్రజాశక్తి-గోరంట్ల**

ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఒ శాంతలక్ష్మి తెలిపారు. మండలంలోని మల్లెల గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసో త్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ చిరుధాన్యాలతో చేసిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పక తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ ఎక్కువ మోతాదులో తినడం వల్ల మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు తొందరగా వచ్చే అవకాశాలున్నాయన్నారు. ప్రతి రోజూ ఉదయం నడవడం, వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నాగరాణి, అంగన్వాడీ టీచర్లు శ్రీకన్య, నిర్మల, కవిత, ప్రభావతి, స్కూల్ ఉపాధ్యాయులు రమేష్, నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పాఠశాల హెచ్‌ఎం నారాయణస్వామి కిబీరువాలు అందజేస్తున్న దాత షణ్ముఖ రెడ్డి

## పాఠశాలకు బీరువాలు వితరణ

**ప్రజాశక్తి-పెనుకొండ**

తన పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలకు ఓ తండ్రి రెండు బీరువాలను అందజేశారు. నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు అనంతపురం జిల్లా కూడేరు మండలంలోని మరుట్ల గ్రామానికి చెందిన షణ్ముఖరెడ్డి గురువారం రెండు బీరువాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మా పిల్లలు చదువుతున్న పాఠశాలకు వారి జేజమ్మ యల్లమ్మ జ్ఞాపకార్థం రూ. 20 వేల విలువ చేసే బీరువాలు అందజేశామన్నారు. హెచ్‌ఎం నారాయణస్వామి షణ్ముఖరెడ్డి దాతృత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజమ్మ, భారతి, కరుణ కుమారి, రేష్మాభాను, ఆనందమ్మ, నరేష్‌కుమార్, బాబు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల పరిశీలన

**ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు**

మండల పరిధిలోని గాజుకుంట్ల పల్లి వరదరాజుల ఆలయ ఆవరణంలో సర్వేనెంబర్ 267-1 లో ఉన్న ప్రభుత్వ భూములను తహశీల్దార్ శ్రీనవాసరెడ్డి పరిశీలించారు. ఈ భూముల్లో నిరుపేదలైన ఎస్సీలకు సాగు భూమి పట్టా ఇవ్వాలని కోరుతూ ఇటీవల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలు కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన అధికారులు గురువారం ప్రభుత్వ భూములను పరిశీలించారు. భూములకు సంబందించిన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తహశీల్దార్ చెప్పారు.

## పారిశుధ్య చర్యలు

**ప్రజాశక్తి - ముదిగుబ్బ**

ప్రత్యేక పారిశుధ్య చర్యల్లో భాగంగా మండలంంలోని మర్తాడు గ్రామం లో అధికారులు, సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. సీజనల్ వ్యాధులు రాకుండా గుంతలు దగ్గర,వాటర్ ట్యాంకు, వీధి కూళాయి దగ్గర, నీరు నిల్వ చోటబ్లీచింగ్ పౌడర్ చల్లారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుళ్లాయి రెడ్డి, ఈవోఆర్డీ దివాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎఎన్ఎం, ఆశా, గోపాలమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

మండల పరిధి లోని బ్రాహ్మణపల్లి - 2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాతమ్మ మాట్లాడుతూ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలన్నారు. పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయిస్తూ పరిశుభ్రత పాటిస్తూ మంచి పౌష్టికాహారం ఇంటిలోనే తయారు చేసి తినిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఇందులత, ఉమా, అనిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు రచ్చబండ

**ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్**

మాజీ ఎమ్మెల్యే దుద్దు కుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. మండల పరిధిలోని నారేపల్లి , మైల సముద్రం, కేశపురం, తిరుమల దేవరపల్లి, కోడప గానిపల్లి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను నిలదీస్తూ, సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

## ఫొటోగ్రఫీపై ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

కెనరా బ్యాంకు సౌజన్యంతో గ్రామీణ స్వయం శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ శాంతిప్రియ తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 31 రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణకు 19 నుంచి 24 సంవత్సరాలు వయస్సు గల నిరుద్యోగులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పించబడతాయన్నారు. ఈ శిక్షణ పుట్టపర్తి పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నాలుగు ఫోటోలు, బ్యాంక్ పాస్ బుక్కు జిరాక్స్‌తో దరఖాస్తులను గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తిలో ఇవ్వవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9705091727 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## కళాశాల రోడ్డు సమస్య పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి - ముదిగుబ్బ**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇబ్బందిగా మారిన దారి సమస్యపై ఆ కళాశాల ప్రిన్సిపల్ తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కళాశాలకు దగ్గర లో ఎన్ హెచ్.342 పోతుండటంతో సదరు కాలేజ్ పాత దారిని తీసి వేశారని దీంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని చెప్పారు. రోడ్డు పూర్తి అయితే ట్రాఫిక్ ఎక్కువై విద్యార్థులు రోడ్డు దాటడం కష్టతరం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు సురక్షిమైన రహదారిని చూపించాలని కోరారు. కాబట్టి ఇక నైనా కాలేజ్ కి వెళ్ళడానికి సరైన ,,సురక్షితమైన దారి ని చూపించాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది స్థానిక తహసీల్దార్ గారికి వినతి పత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ గారు స్పందిస్తూ ,,మండల సర్వేయర్ కు చెప్పి సర్వే చేసి పిల్లలకు దారి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు..అలాగే సర్వే నివేదిక వచ్చాక తప్పక సమస్యని పరిష్కరిస్తామన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఐ టిడిపి అధ్యక్షులు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్‌ను ఐ టీడీపీ జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన జిల్లా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఐటీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న


కలెక్టర్‌తో జయప్రకాష్

# అంతర్ పంటల సాగుతో అధిక ఆదాయం

## కలెక్టర్ శ్యాంప్రసాద్


రైతులో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి - నంబులపూలకుంట**


వేరుశనగ పంటతోపాటు అంతర్ పంటలను సాగు చేసుకుని అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని ధనియా చెరువు గ్రామంలో రైతు నారాయణ సాగుచేసిన వేరుశనగ పంటలో అంతరపంటలుగా సాగుచేసిన పెసర, కంది పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేరుసెనగ పంటతోపాటు అంతర్ పంటలను సాగు చేయాలన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ సనావుల్లా, ఆర్డీవో వివిఎస్ శర్మ, తహశీల్దార్ దేవేందర్ నాయక్, ఏవో లోకేశ్వర్ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

**తహశీల్దార్ కార్యాలయం తనిఖీ :** స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ శ్యాం ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. మండల పరిధిలో సోలార్ ప్లాంట్ కు గతంలో ఎన్ని వేల ఎకరాలు ఇచ్చారని ఆరా తీశారు. ప్రస్తుతం మద్రికొమ్మదిన్నె ,వెలిచలమల , ధనియాని చెరువు గ్రామాల పరిధిలో ఎనిమిది వేల ఎకరాలు గుర్తించాలని, గ్రామ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. త్వరలోనే కేంద్ర ఎన్‌పిటిసికి భూములు బదలాయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో హద్దులను సర్వేయర్లు గుర్తించి చిత్రపట నమూనాలను అప్పగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మ, తహశీల్దార్ దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# పొంచి ఉన్న ప్రమాదం

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

కదిరి పట్టణంలోని సి అండ్ ఐ జి ఎం చర్చి ప్రాంగణంలో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకర స్థితిలో ఉంది. ప్రజలు పలుమార్లు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, సరైన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు స్థానికుల నుంచి వినపడుతున్నాయి.కొంతవరకు కూల్చివేత పనులు మొదలుపెట్టి వదిలేయడంతో, మిగిలిన గోడలు, రాళ్ళు ఎప్పుడైనా కూలిపోతాయన్న భయాందోళనలో ప్రజలు ఉన్నారు. ఈ ప్రదేశం చాలా రద్దీ ప్రాంతం. ఆసుపత్రికి వచ్చే రోగులు, చర్చికి వచ్చే భక్తులు చర్చి ప్రాంగణంలో తిరిగే చిన్నపిల్లలు, దగ్గరగా ఉన్న రోడ్డు మీద నడిచే పాదచారులు, వాహనదారులకు ఈ ట్యాంక్‌ను నుంచి ప్రమాదం పొంచి ఉంది.ఏదైనా జరగరాని సంఘటనలు జరిగితే బాధ్యులు ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని పాడైపోయిన ట్యాంక్‌ను పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రమాదపు అంచున ఉన్న నీటిట్యాంక్

## సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు రాష్ట్రపతికి ఆహ్వానం

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

పుట్టపర్తి సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును సత్యసాయి మేనేజింగ్ సెంట్రల్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శతజయంతి ఉత్సవాలకు ఆహ్వానించారు. నవంబర్ 23న పుట్టపర్తిలో అంగరంగ వైభవంగా సత్య సాయి శతజయంతి ఉత్సవాలు జరుగుతాయని రాష్ట్రపతికి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి సత్యసాయి మానవాళికి చేపడుతున్న సేవలను అభినందించినట్లు ఆయన తెలిపారు.


రాష్ట్రపతికి పుష్పగుచ్చం అందజేస్తున్న రత్నాకర్

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బుక్కపట్నం విద్యార్థులు

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

అండర్ - 19 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బుక్కపట్నం విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న నరేంద్ర, విష్ణువర్ధన్ అండర్ - 19 విభాగంలో అనంతపురంలోని ఆర్ డి టి స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి హాకీ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

## 'కాకతీయ విద్యానికేతన్'లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఉంచారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్ శెట్టిపి పద్మ మాట్లాడుతూ విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఫుడ్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

# సమయపాలన పాటించకపోతే చర్యలు

## డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం

**ప్రజాశక్తి - తలుపుల**

విధి నిర్వహణలో సమయ పాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం హెచ్చరించారు. ఈ మేరకు ఆమె గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సలహా సూచనలు ఇచ్చారు. ఓబుళరెడ్డి పల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేందర్ నాయక్, హోమియోపతి వైద్యులు లక్ష్మీ నరసయ్య, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**నంబుల పూలకుంట:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఫైరోజా బేగం గురువారం తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా వైద్యాధికారులు సమ్మెలో పాల్గొనడంతో ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి ఈ సందర్భంగా వివరించారు . ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలోని మందులు నిల్వ ఉంచే గదులను పరిశీలించారు. మండల పరిధిలోని 14 పంచాయతీల పరిధిలో ఉండే గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కాన్పులు అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత స్థానిక ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** స్థానిక ప్రాథమిక వైద్యకేంద్రాన్ని డిఎంహెచ్ఒ గురువారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేంద్ర నాయక్, ఎంపిహెచ్ఇఒ వేణుగోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది మంజుల, రవిశంకర్, అలివేలమ్మ, వినయ్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

**గాండ్లపెంట :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు, మాత శిశు సంరక్షణ, అంటువ్యాధులు తదితర అంశాలపై వైద్యసిబ్బందితో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి నాగేష్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

# న్యాయవాదులు విధుల బహిష్కరణ


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**ప్రజాశక్తి-హిందూపురం**

కక్షిదారులు, న్యాయవాదులకు అందరికీ అనుకూలంగా ఉన్న కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వన్నేరువప్ప, రామచంద్రప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ లో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం వల్ల న్యాయవాదులు, కక్షిదారులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం అమరావతిలో హైకోర్టు ఉండటంతో అటు న్యాయవాదులు ఇటు కక్షిదారులు అనేక వ్యయప్రయాసాలకు గురికావాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆలోచించి కర్నూలును న్యాయ రాజధాని చేయడంవల్ల రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలు అభివద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, రాజశేఖర్, నాగరాజు రెడ్డి, సుదర్శన్, సిద్దు, ఇందాద్, శ్రీరాములు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం : పల్లె

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తనపై చేసిన ఆరోపణల్లో ఏ ఒక్కటి నిరూపించిన శాశ్వతంగా రాజకీయాలకు స్వస్తి పలుకుతానని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం శ్రీధర్ రెడ్డి తనపై అనవసర ఆరోపణలు చేశాడన్నారు. గత ఐదేళ్లలో ఎమ్మెల్యేగా ఆయన చేసిన అక్రమాలు అవినీతి పుట్టపర్తి ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. భూ దందాలు, బిల్డర్లతో సాగించిన వసూళ్లు, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యం రవాణా, గంజాయి స్మగ్లింగ్, గ్యాంబ్లింగ్, రౌడీయిజం, ఇవన్నీ వైసిపికి పేటెంట్ హక్కులు అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం పుట్టపర్తి ప్రజలు ప్రశాంతంగా జీవితం గడుపుతున్నారన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడే నియోజకవర్గంలో 193 చెరువులకు నీరు నింపడానికి రూ. 4.45 కోట్లతో డిపిఆర్ తీసుకువస్తే ఐదేళ్లు ఏమీ చేయలేక కనీసం అసెంబ్లీలో మాట్లాడనిని శ్రీధర్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కల్తీ మద్యం వైసిపి హయాంలో వరదల పారించి, సామాన్యులను బలి తీసుకుందన్నారు. నోటిని అదుపులో పెట్టుకోవడం మంచిదని పల్లె హితవు పలికారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

**ప్రజాశక్తి- హిందూపురం**

హిందూపురం మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, బాలాజీ పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని ఆబాద్ పేటలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆబాద్ పేటలో ప్రధానంగా కాలువల సమస్య ఎక్కువగా ఉందని, డ్రైనేజ్ నీరు రహదారుల పైకి వచ్చి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. త్వరలోనే రహదారులు, కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. హిందూపురం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా నిలబెట్టేందుకు పట్టణ ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్షాద్ అహమ్మద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, టీడీపీ నాయకులు అజ్మతుల్లా, ఇందాద్, యూసఫ్, మున్సిపల్ డీఈఈ మదన్ కుమార్, ఏఈ జనార్ధన్, సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

**వాహన మేళా :** కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల నూతన వాహనాల కొనుగోలుదారులకు ఎంతో అనుకూలంగా ఉందని మున్సిపల్ చైర్మన్ డి రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, బాలాజీ పేర్కొన్నారు. గురువారం స్థానిక చర్చి మైదానంలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహన మేళాను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా మారిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కరుణా సాగర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్ ఇర్షాద్ అహమ్మద్, టీడీపీ నాయకులు శివ శంకర్, రామాంజినమ్మ, అజ్మతుల్లా, ఇందాద్, వాసు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## యువకుడు ఆత్మహత్య

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

మండలకేంద్రంలోని నెహ్రూ నగర్ కు చెందిన యువకుడు బుధవారం రాత్రి ఇంటిలోనే తన ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు... కాలనీకి చెందిన చాకలి పవన్ కళ్యాణ్ (19) కుటుంబ ఇబ్బందులతో సతమతమవుతూ జీవితం పై విరక్తి చెంది ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే పవన్‌కళ్యాణ్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మారుతిశంకర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - తాడిమర్రి**

మండల పరిధిలోని పెద్దకోట్ల గ్రామానికి చెందిన గోగుల పెద్దన్న(56) అనే వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన గోగుల పెద్దన్న ధర్మవరం నుండి తిరుగు ప్రయాణంగా బత్తలపల్లి వరకు ఆటోలో వస్తుండగా బత్తలపల్లి గ్రామ శివారులోని అన్నపూర్ణ డాబా దగ్గర ఆటోను వెనక నుండి లారీ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో పెద్దకోట్ల గ్రామానికి చెందిన గోగుల పెద్దన్నను అతని కుమారుడు అనంతపురంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లగా అక్కడ మృతిచెందాడు.

## రిటైర్డ్ టీచర్ ఇంట్లో చోరీ

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

కొత్త చెరువులోని పూజారి వీధిలో నివాసముంటున్న రిటైర్డ్ టీచర్ శాంతమ్మ ఇంటిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. శాంతమ్మ బుధవారం ఉదయం తన ఇంటికి తాళం వేసి తమ బంధువులు ఉన్న కదిరికి వెళ్లింది. ఆరోజు రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగలగొట్టి అందులోకి ప్రవేశించి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న మూడుతులాల బంగారు బ్రాస్‌లెట్, ఉంగరం ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం చుట్టుపక్కల ఇళ్లవారు సమాచారం ఇవ్వడంతో శాంతమ్మ వచ్చి చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ముగ్గురిపై కేసు నమోదు

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

తన ఇంటికి సంబందించి గోడ కూల్చివేత ఘటనపై నల్లమాడ మండలం చౌకలంక పల్లి గ్రామానికి చెందిన వనం శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖాదర్ ఖాన్, ఖాదర్ ఖాన్ భార్య, వారి కుమారుడు మన్సూర్ పై కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. అక్రమంగా వాళ్ళ స్థలములోకి ప్రవేశించి జెసిబితో ఇంటికి సంబంధించిన సన్ షెడ్ ను పగలగొట్టి నాశనం చేశారని బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

## పేకాట జూదరులు అరెస్ట్

**ప్రజాశక్తి - అమడగూరు**

మండల పరిధిలోని పూలు కుంటపల్లి గ్రామ పంచాయతీ ఏటిగడ్డతండా సమీపాన పేకాట ఆడుతున్న నలుగురికి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ట్రైనీ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 7400 రూపాయల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండల పరిధిలోని పాతచామలపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వడ్డీ సురేష్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంతో మృతుడి కుటుంబాన్ని టిడిపి సీనియర్ నాయకుడు జి. లక్ష్మీనారాయణ యాదవ్ గురువారం పరామర్శించారు. బాధితులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేసి, భవిష్యత్తులో కూడా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దాం

**ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు**

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దామని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. అమెరికా ఆధిపత్య ధోరణిపై ముద్రించిన కరపత్రాలను వారు గురువారం పంపిణీ చేశారు. ట్రంప్ అడుగులకు మడుగులొత్తే మోడీ లొంగుబాటు విధానంపై పోరాడదామన్నారు. అమెరికా ఆధిపత్యం పోరుపై ప్రధాని వైఖరిని కరపత్రాల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ం అంటూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు పంపిణీ వేశారు. ఈ ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు వివి రమణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇఒకు సన్మానం

**ప్రజాశక్తి -హిందూపురం**

హిందూపురం మండల విద్యాశాఖ అధికారి గంగప్పను ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. గంగప్పకు ఇటీవల విజయవాడలో గుర్రం జాషువా, మాధురి అవార్డులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మా నించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారిగా గంగప్ప ఓవైపు విద్యాభివృద్ధికి కృషి చేస్తూ మరోవైపు సంగీతం, సాహిత్యం పై కూడా పట్టు పెంచుకొని అవార్డులు దక్కించుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. ఇందులో భాగంగా ఆయా రంగాల్లో గంగప్ప చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాంచజన్య శ్రీనివాసులు. ప్రతినిధులు ఆల్ అమీన్ రియాజ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఇఒను సన్మానిస్తున్న ప్రయివేటు స్కూల్స్ ప్రతినిధులు

## మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తాం

**ప్రజాశక్తి - తాడిమర్రి**

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తామని వైసిపి నాయకులు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీ కరణకు వ్యతిరేకంఆ వైసిపి చేపట్టిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా గురువారం తాడిమర్రి మండల కేంద్రంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రాంరెడ్డి ఆవిష్కరించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి నియోజకవర్గ పరిశీలకులు నార్పల సత్యనారాయణ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, కుంటాల పుల్లయ్య ఆరవేటి కాటమయ్య శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టరును ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు